క్లుప్తంగా

అగ్నిప్రమాద మృతుడి కుటుంబానికి పరామర్శ



పెదకాకాని: అగ్ని ప్రమాదంలో గ్యాస్ సిలెండర్ పేలి వైఎస్సార్ సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్ అమ్మిశెట్టి తులసీనాథ్ మృతి చెందడం బాధాకరమని పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. తులసీనాథ్ మృతి చెందిన విషయం తెలుసుకుని సోమవారం వెంకటకృష్ణాపురం వెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యులను, బంధువులు పరామర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో పెదకాకాని శివాలయం మాజీ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పార్టీ గ్రామ కన్వీనర్ కానుగోలు శంకరరావు, తోటకూర వెంకటేశ్వరరావు, చాగంటి మురళీమోహన్‌రెడ్డి ఉన్నారు.

వరి పంటలో దిగుబడి అంచనా ప్రయోగం

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో వరి పంటలో దిగుబడి అంచనా ప్రయోగాన్ని సోమవారం మండల గణాంక అధికారి సుబ్బయ్యశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. దిగుబడి అంచనా ప్రయోగంలో భాగంగా మూడు సర్వే నంబర్‌లలో ఒక్కొక్క సర్వే నెంబరులో 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో వరి పంట కోసి నూర్పిడి చేసి ధాన్యం తూకం వేసి దిగుబడి అంచనా వేశారు. మూడు నెంబర్ల సరాసరి దిగుబడి ఎకరానికి 32 బస్తాలు(ఒక్కొక్క బస్తా 75 కేజీలు) వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధి రఫీ, రైతులు వంగా నవీన్‌రెడ్డి, నామా శ్రీనివాసరావు, గ్రామంలోని రైతులు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో ప్రత్యేక హోమాలు



గుంటూరు రూరల్: కార్తికమాసం నాలుగో సోమవారాన్ని పురస్కరించుకుని నల్లపాడులోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చనలు నిర్వహించారు. భక్తులు విశేషంగా దేవాలయానికి విచ్చేసి కార్తిక దీపాలు వెలిగించి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీగణపతి రుద్ర చండీ సప్తశతి హోమం నిర్వహించారు.

రగ్బీ పోటీల్లో సత్తా చాటిన తక్కెళ్లపాడు బాలికలు

పెదకాకాని: రగ్బీ పోటీల్లో సత్తా చాటడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన బాలికలు యు.హారిక, పి.సింధు గుంటూరు జిల్లా అండర్- 17 బాలికల రగ్బీ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 23, 24 తేదీలలో కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్- 17 బాలికల గుంటూరు జట్టులో పాల్గొని ప్రతిభ కనపరచారు. పోటీల్లో గుంటూరు జట్టు రన్నర్(ద్వితీయ) స్థానంలో నిలిచింది. పాఠశాల నుంచి జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులను సోమవారం పాఠశాల హెచ్ఎం జీఎం శ్రీనివాసరెడ్డి, పీఈటీ అశోక్ అభినందించారు.

వాలీబాల్ పోటీలకు నాగమల్లేశ్వరి ఎంపిక

వేజండ్ల(చేబ్రోలు): జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోట్ల నాగమల్లేశ్వరి ఎంపికైనట్లు పీఈటీ టి.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయనగరంలోని బోగాపురంలో నిర్వహించిన అండర్-14 విభాగంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో గుంటూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన కోట్ల నాగమల్లేశ్వరి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయింది. ఈ విద్యార్థిని డిసెంబర్ 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వారణాసిలో నిర్వహించనున్న పోటీలకు హాజరు కానుంది. విద్యార్థిని మల్లేశ్వరిని హెచ్ఎం టి.విజయశ్రీ, పీఎంసీ చైర్మన్ పఠాన్ రబియా అభినందించారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకోవాలి

పమిడివారిపాలెం(కాకుమాను): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన రైతులు ఆయా గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకుని రైతులు ప్రభుత్వ మద్దత ధర పొందాలని ఏఓ సుధారాణి అన్నారు. మండలంలోని పమిడివారిపాలెంలో యంత్రాల ద్వారా వరి పైరును కోస్తున్న ధాన్యాన్ని సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని 17 శాతం లోపు తేమ ఉండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని ఆమె సూచించారు. కామన్ రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.2,300, ఏ రకం ధాన్యానికి రూ.2,320 ప్రకటించినట్లు చెప్పారు.

పత్తిలో గులాబి తెగులు కలవరం

- సస్యరక్షణ అవసరం
- ఉధృతి నివారణకు చర్యలు



కాయ, పత్తిలో గులాబి రంగు పురుగులు

పత్తి పంటలో ఏర్పాటు చేసిన లింగాకర్షక బుట్టలు

గుంటూరు రూరల్: పత్తి పంటలో గులాబి రంగు పురుగు కనిపిస్తోంది. పురుగు రైతులను కలవరపరుస్తోంది. గత 4- 5 ఏళ్లుగా రైతులను వెంటాడుతోంది. ఈ పురుగులు కంటికి కనిపించకుండా కాయలోపలే ఉంటూ వాటి జీవిత చక్రాన్ని పూర్తి చేసుకుంటాయి. దీని వల్ల దిగుబడి తగ్గి నష్టం కలుగుతుంది. నివారణకు చర్యలు పాటించి పంటలను కాపాడుకుని నష్టశాతాన్ని తగ్గించుకోవాలని లాం ఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు సూచిస్తున్నారు.

పురుగులు గుర్తించే విధానం:

పంటలో ఎక్కువగా గుడ్డి పూలు గుర్తించటం, కాయలపైభాగంలో పురుగులు బయటకు వచ్చేందుకు గుండ్రటి రంధ్రం ఉండటం, కాయ తొనల మధ్య గోటిలపై గుండ్రటి రంధ్రం, గుడ్డి పత్తి, రంగుమారిన పత్తి ఉన్నట్టయితే గులాబిరంగు పురుగులు ఉన్నట్లు గుర్తించాలి. పత్తి పొలంలో చేను చుట్టు తుత్తురు బెండ, ఉమ్మెత్త లాంటి మొక్కలు లేకుండా చేసుకోవాలి. సకాలంలో సరైన యాజమాన్య పద్ధతులు సేంద్రియ, నత్రజని ఎరువుల సమతుల్యతను పాటించి పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు. గులాబిరంగు పురుగుల గుడ్లను ఆశించే ట్రికోగామా పరాన్న జీవులు అందుబాటులో ఉంటే ఒక ఎకరానికి 60 వేల పరాన్న జీవనులను పూత దశలో వారం రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా పంటలో విడుదల చేసుకోవాలి. దీని ద్వారా పురుగులను గుడ్డు దశలో నివారించుకోవచ్చు.

60 రోజుల దశలో..

గులాబి రంగు పురుగులు ఆశించినట్టు గుర్తించినట్టయితే 5 శాతం వేప గింజల కషాయం కానీ వేప నూనె 1500 పీపీఎం ఒక లీటరు నీటికి కలిపి ఎకరానికి లేదా ప్రొఫెనోపాస్ 50 ఈసీ 400 ఎంఎల్ ఒక ఎకరానికి, లేదా థయోడికార్బ్ 75 డబ్ల్యూపీ 300 గ్రాములు ఎకరానికి తగిన నీటితో కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ విధంగా చేస్తే పంటలో రెక్కల పురుగులు గుడ్లను పెట్టకుండా నివారించుకోవచ్చు.

90–120 రోజుల దశలో..

ప్రొఫెనోపాస్ 50 ఈసీ 400 ఎంఎల్, లేదా థయోడికార్బ్ 75 డబ్ల్యూపీ 300 గ్రాములు లేదా క్వినాల్ఫాస్ 25 ఈసీ 2.5 ఎంఎల్, లేదా క్లోరిపైరిపాస్ 20 ఈసీ 2.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి లేదా పైరిడాలిన్ 10 ఈసీ 1.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు లేక మూడు సార్లు మందులను మార్చి మార్చి పంటలపై పిచికారి చేసుకున్నట్టయితే గొంగళి పురుగులను కాయతొలిచే పురుగులను నివారించుకోవచ్చు.

120 రోజుల తరువాత..

సింథటిక్ పైరిపాయిడ్స్ మందులైన సైఫర్‌మైత్రిన్ 25ఈసీ 1 ఎంఎల్, లేదా లాంబ్డాసైహలోత్రిన్ 5 శాతం ఈసీ 1 ఎంఎల్ లేదా బైఫెనోత్రిన్ 10 శాతం ఈసీ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఇటువంటి సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు పంటలపై ఎక్కువ సార్లు పిచికారి చేయకూడదు. ఎక్కువ సార్లు పిచికిరి చేసినట్టయితే రసం పీల్చే పురుగులు, పేనుబంక, తెల్లదోమ ఆశించే ప్రమాదం ఉంది. యాజమాన్య పద్ధతులు పాటించి పత్తి పంటను చీడపీడలనుంచి కాపాడుకోవచ్చు.

పురుగుల ఉధృతి తెలుసుకునే విధానం

పురుగుల ఉధృతిని తెలుసుకునేందుకు పత్తి పండించే రైతులు అందరూ సామూహికంగా ఎకరానికి 4-6 లింగాకర్షక బుట్టలను పంటలో ఏర్పాటు చేసుకోవాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే 10-15 లింకాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రతి రోజు బుట్టలలో పడిన రెక్కల పురుగులను గమనిస్తూ ఉండాలి. బుట్టలలో పడిన రెక్కల పురుగులను చంపివేయాలి. గుడ్డి పూలను ఏరివేసి నాశనం చేయాలి. వరసగా మూడు రోజులపాటు ఒక లింగాకర్షక బుట్టలో ఎనిమిది రెక్కల పురుగులను గమనించినట్టయితే, లేదా 20 కాయలను కోసినపుడు 2 కాయలు పుచ్చినట్టయితే పురుగులు ఉన్నట్లు భావించాలి.

యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ అవసరం



సరైన యాజమాన్య పద్ధతులు పాటించి, సకాలంలో పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టి పత్తి పంటను నష్టం నుంచి కాపాడుకోవాలి. పత్తి పంట కాలం కంటే ఎక్కువ కాలం చేలో లేకుండా తీసి వేయాలి. పత్తి నిల్వ చేసుకునే ప్రదేశాలు, మిల్లులు ప్రాంతాల్లో కూడా గులాబిరంగు పురుగుల నివారణ చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ ఎం.వెంకటరాములు, ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త

క్వారీ దేవస్థానం వద్ద అన్నదానం



చేబ్రోలు: ఖ్యాతిగాంచిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. సందర్భంగా దేవస్థానం ప్రాంగణం వద్ద అన్నదానం నిర్వహించారు. పాగోలు మునేశ్వరరావు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వందలాది మందికి నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారం

గుంటూరు రూరల్: త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం కార్యక్రమాన్ని కార్తికమాసం పర్వదినాలను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వెంగళాయపాలెంలో నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షులు, సభ్యులు రౌతు శ్రీనివాసరావు, కృష్ణారావు, శివలింగంనాయక్, రామకృష్ణ, బ్రహ్మం, పట్టాభి, శ్రీను, సుధాకర్, హరిబాబు, రామోజీ నాయక్, సుబ్బారావు, గోపి, దిలీష, విద్య, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవర్చుకోవచ్చు

కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ సుబ్బారావు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులు దేశ రక్షణలో భాగస్వాములు కావచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులు సామాజిక సేవను అలవరుచుకోవాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఏఎన్‌ఓలు స్వాతి, ఎం.నవీన్‌కుమార్, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ అబ్దుల్లాబేగ్ పాల్గొన్నారు.

వేపగింజల ద్రావణం తయారీపై అవగాహన



వేపగింజల ద్రావణం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

ప్రత్తిపాడు: బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా సోమవారం రైతులకు వేపగింజల ద్రావణం తయారీపై అవగాహన కల్పించారు. ద్రావణం వలన పంటలకు ఎంతో మేలు చేకూరుతుందని, తక్కువ ఖర్చులో మేలైన ఫలితాలు ఉంటాయని తెలిపారు. ద్రావణాన్ని ఐదు శాతం మిరప పంటలో ఉపయోగించడం వలన పంటలో రసం పీల్చు పురుగుల ఉధృతి తగ్గుతుందని చెప్పారు. కూరగాయల పంటల్లో కూడా ఈ ద్రావణాన్ని వినియోగించవచ్చని, ఫలితంగా దిగుబడులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ లాభసాటిగా ఉండేందుకు వేపగింజల ద్రావణం దోహదపడుతుందని రైతులకు వివరించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లుపై పనిభారం తగ్గించండి

ఎంపీడీఓ, తహసీల్దార్లుకు వినతి



ఎంపీడీఓ శివపార్వతికి వినతిపత్రం అందిస్తున్న ప్రత్తిపాడు మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ప్రత్తిపాడు: ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారని, నాన్ ఇంజినీరింగ్ పనులను ఇంజినీరింగ్ అసిస్టెంట్లుకు అప్పగించవద్దని కోరుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అధికారులకు వినతి పత్రాలు అందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.శివపార్వతి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కరుణకుమార్‌లకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లుకు బహుళ పనులను అప్పగించడం ద్వారా అభివృద్ధి కార్యకలాపాలకు, ప్రభుత్వ ప్రాధాన్య పనులకు ఆటంకం ఏర్పడుతుందని వివరించారు. అంతేకాకుండా మాపై అధిక ఒత్తిడి, పనిభారం పెరుగుతుందని మెమోరాండంలో పేర్కొన్నారు. నాన్ ఇంజినీరింగ్ పనులను ఇంజినీరింగ్ అసిస్టెంట్లుకు అప్పగించవద్దని, దాని వలన అభివృద్ధి పనుల పురోగతికి ఆటకం ఏర్పడుతుందని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీహెచ్‌కే ప్రసాద్, ఎం.నిఖిల్‌తేజ్, ఎ. శివకృష్ణ, ఎం.లావణ్య, రామచంద్ర, ఎం.తేజశ్రీ, డి.శివశంకర్, జి.రోహిణి, జి.పవన్, ఎం. వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు స్పందన కరువు..

- పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలు
- అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు దూరం
- తహసీల్దార్ కార్యాలయంలో తగ్గిన వివిధ శాఖల హాజరు
- గత వారం నిల్.. ఈ వారం రెండు అర్జీలు



పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం

పొన్నూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రతి సోమవారం పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు స్పందన కరువవుతోంది. మండల ప్రజల నుంచి వివిధ సమస్యలపై అధికారులు స్వీకరిస్తున్న అర్జీలకు పరిష్కారం లభించకపోవడంతో అర్జీల రూపంలో సమస్యలు తెలియజేసేందుకు ప్రజలు రావడం లేదు. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మొక్కుబడిగా సాగుతోంది. ప్రతి సోమవారం జిల్లా కేంద్రాలలో ఉన్నతాధికారులు ప్రజల నుంచి వందలాది అర్జీలను స్వీకరిస్తున్నారు. కానీ పొన్నూరు మండలంలో మాత్రం అందుకు భిన్నంగా సాగుతోంది. ఒక్క అర్జీ కూడా రాని రోజులున్నాయి. గతం సోమవారం అర్జీలు నిల్.. ఈ వారం రెండు అర్జీలు మాత్రమే వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో పాల్గొనకపోవడంతోనే గ్రీవెన్స్‌డేకు స్పందన కరువవుతోందనే విమర్శలు వస్తున్నాయి.

– ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించేలా ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరై, బాధితుల సమస్యలను పరిష్కరించాలి. మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారుల హాజరు అరకొరగానే ఉంటుంది. పలువురు అధికారులు అలా వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు. పట్టుమని పది నిమిషాల పాటు కూర్చోవడం లేదు. దరిమిలా వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు అధికారుల్లేక వెనుదిరిగి వెళ్తున్నారు. కొంతమంది అధికారులు తాము గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హాజరవుతున్నామని చెప్పి తప్పించుకుంటున్నారు.

రెండు అర్జీలు వచ్చాయి..

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు అర్జీలను వచ్చాయి. మున్సిపాలిటీకి సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలియజేశాం.

–రమేష్, సూపరింటెండెంట్, తహసీల్దార్ కార్యాలయం

పేదలకు అన్నదానం



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో కార్తిక సోమవారం సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని 'అందరి ఆనందం సామాజిక సేవా గ్రూప్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం పేదలకు అన్నసేవను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం స్థానిక గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డులో పెట్రోలు బంకు సమీపంలో దాతల సహకారంతో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని గ్రూపు నిర్వాహకులు సోమేపల్లి వీరాంజనేయులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.ఆదేశ్వరరావు, కె.సురేష్, ఎస్‌కే మీరాతో పాటు పలువురు ప్రారంభించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ప్రత్తిపాడు: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన పోటీలను ఎంఈఓలు సీహెచ్ రమాదేవి, జి. లీలారాణి పరిశీలించారు. అనంతరం భారత రాజ్యాంగం విశిష్టతపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈఓలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని వివరించారు. రాజ్యాంగం విశిష్టతను ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే తెలుసుకోవాలని చెప్పారు. తొలుత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుంది? అన్న వివరాలను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు.

కొండపాటూరు పాఠశాల పరిశీలన

కొండపాటూరు(కాకుమాను): ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయి నుంచే అభినయ గేయాలపై ఆసక్తి కలిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన అభినయ గేయాలను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అభినయ గేయాలు, నాటకీకరణ ద్వారా విద్యార్థులలో బోధనా సామర్థ్యాలు పెంపొందుతాయని చెప్పారు. ప్రతి పాఠశాలలో కొంత సమయాన్ని ఉపాధ్యాయులు అభినయ గేయాలకు కేటాయించి విద్యార్థులకు ఆయా గేయాలపై ఆసక్తి కనబరిచే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు గేయాలు నేర్పిస్తున్న హిందీ ఉపాధ్యాయిని ప్రమీలాదేవిని ఎంఈఓ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భజన



పెదకాకాని: హరి హర సుతుడు అయ్యప్పస్వామి భజన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్లలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గత నెల రోజులుగా అయ్యప్ప స్వామి, దుర్గాభవాని, అడిగొప్పుల శ్రీలక్ష్మీఅమ్మవారు, శ్రీశైలం తదితర మాలధారణ చేసిన భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద ఆదివారం రాత్రి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అరటి మండపాలతో అలంకరించి విఘ్నేశ్వరుడు, అయ్యప్పస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి, కనకదుర్గ అమ్మవారు, వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి మున్నంగి సుబ్రహ్మణ్యస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి అభిషేక పూజలు, పడిపూజలు నిర్వహించారు. మార్కాపురం శ్రీను ఆర్కెస్టా ద్వారా ఆధ్యాత్మిక భక్తిగీతాలు మృదుమధురంగా ఆలపించారు.

ధ్యానంతో వ్యాధులు దూరం



అతిథిని సన్మానిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: జీవనశైలి మార్పులు, ఆహారం, శరీర వ్యాయామం, మనసు స్థితి వంటి వాటి ద్వారా జన్యువుల ప్రభావం ఎలా మారుతుందో ఏపీ జెనెటిక్స్ పరిశోధన చేస్తోందని క్వాంటమ్ హీలింగ్ ట్రైనర్, హీలర్ ఎస్.భాస్కర్ తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి ఒత్తిడి తగ్గించే పద్ధతులను అభివృద్ధి చేయడం లేదా స్వీయ-హిప్నాసిస్, విజువలైజేషన్ లేదా ధ్యానం నేర్చుకోవడంతో ఆరోగ్యంపై ఆలోచనలు, మనస్సు శక్తిని ఉపయోగించటం ద్వారా ఒక వ్యక్తి వ్యాధి యొక్క రోగనిరోధక ప్రతిస్పందనను పెంచుకోవచ్చని చెప్పారు. మన ఆరోగ్యం జీవనశైలిని ప్రభావితంచేసే ప్రధానమైన అంశాలు జీవశాస్త్రంలో విప్లవాత్మకంగా పరిశోధనలను తీసుకొచ్చాయన్నారు. వాటిలో ఒకటైన ధ్యానం ఒక ప్రభావవంతమైన సాధనంగా ఏపీ జెనెటిక్స్‌పై ప్రాధాన్యం సంతరించుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా భాస్కర్‌ని చలపతి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామారావు నాదెండ్ల ఘనంగా సత్కరించారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, వెలుగు సభ్యులు

చేబ్రోలు: మహిళల చట్టాలు, వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని చేబ్రోలు తహసీల్దారు కే శ్రీనివాస శర్మ అన్నారు. చేబ్రోలు తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహించారు. మండల సమాఖ్య, మండల స్థాయి అధికారులు, మహిళలు, ఉద్యోగులు పాల్గొని మానవహారంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దారు శ్రీనివాసశర్మ మాట్లాడుతూ బాలికలు, చిన్నారులు, మహిళలపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యాలు నేర్చుకునేందుకు మద్దతు ఇవ్వాలన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సాధికారత సాధించటానికి అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మైలా వెంకట రామరాజు పాల్గొన్నారు.

మహిళలకు సముచిత స్థానం కల్పించాలి

గుంటూరు రూరల్: ప్రతి రంగంలో మహిళలు అగ్రస్థానంలో సేవలందిస్తున్నారని, స్త్రీలపై వివక్ష విడనాడి పురుషునితో సమానంగా సముచిత స్థానం కల్పించినప్పుడే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. మహిళా భద్రత, రక్షణకు ప్రభుత్వాలు అనేక కఠిన చట్టాలు తీసుకొచ్చాయని, వీటిపై ప్రతి ఒక్కరికి అవగాహనను కల్పించాలని కమిటీ ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి.సుధావాణి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి, స్థానిక వ్యవసాయాధికారి కె.అరుణకుమారితో కలసి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని రూ.1,23,917 విలువ చేసే 112 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. వ్యవసాయశాఖ నుంచి అనుమతి పత్రాలు అన్నీ వచ్చిన తరువాతనే అమ్మకాలు కొనసాగించాలని దుకాణ నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపార లావాదేవీలను నిర్వహించాలని స్పష్టం చేశారు.